పద్దుకు వేళాయెరా..

రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే

న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

హెచ్‌ఆర్‌ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్‌ఆర్‌ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్తదానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మున్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.



బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

వీ అనంత నాగేశ్వరన్: ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

మనోజ్ గోవిల్: ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

అజయ్ సేఠ్: ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

తుహిన్ కాంత పాండే: ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

అరుణిష్ చావ్లా: ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

ఎం నాగరాజు: త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.

ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేధోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

కనిపించని చిత్తశుద్ధి..

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

ఎన్ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపారాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్ఎల్‌సీలో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు

కార్మికుల ధర్నాకు బిగాల సంఘీభావం

నమ్మె శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

ఖిలీల్‌వాడి, జనవరి 30: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ రంగ కార్మికులు నగరంలో ధర్నా చేపట్టారు. స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నా శిబిరాన్ని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా గురువారం సందర్శించి, కార్మికులకు సంఘీభావం తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పథకాలు వర్తించేలా కేసీఆర్ చర్యలు తీసుకున్నారన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సత్యప్రకాశ్, దండు శేఖర్, భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

నిజామాబాద్ నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

బోధన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట..

కంఠేశ్వర్/బోధన్, జనవరి 30: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ నగర కార్పొరేషన్, బోధన్ మున్సిపల్ ఎదుట టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, బోధన్ రాష్ట్ర నాయకుడు మల్లేశ్ మాట్లాడారు. సుప్రీంకోర్టు 2016లో ఇచ్చిన తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 10వ తేదీ లోపు కార్మికుల వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ, రెండు మూడు నెలలకోసారి చెల్లిస్తున్నారని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిజామాబాద్‌లో చేపట్టిన ధర్నాలో నాయకులు రాజేశ్వర్, గోవర్ధన్, శివకుమార్, రవికుమార్, రజిని, సుజాత, లక్ష్మి, నాగారావు, యాదమ్మ, శాంతికుమార్, రాము, లక్ష్మణ్, విజయ్ పాల్గొన్నారు. బోధన్‌లో ధర్నా అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, పెద్ద గంగామణి, పి. భూమయ్య, శివకుమార్, గాబ్రియేల్, గోపి, రాజు, పోశెట్టి, ఎం. అబ్బయ్య, అశోక్, నవాబ్, సత్యనారాయణ, పవన్, కార్మికులు పాల్గొన్నారు.

వేతనం రాలేదని జీపీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

పల్లెప్రగతిలో తెలంగాణ ఉత్తమ సేవా పత్రం అందుకున్న లస్కర్

సిరికొండ, జనవరి 30: వేతనం రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గడ్డమీది తండా గ్రామ పంచాయతీ ఏర్పడిన నాటి నుంచి గుగ్లోత్ లస్కర్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనంతరం 2022వ సంవత్సరంలో గంగు అనే మరో వ్యక్తిని కార్మికురాలిగా నియమించారు. ఇద్దరికీ గ్రామ పంచాయతీ నుంచి వేతనం చెల్లిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నది. అయితే లస్కర్‌కు వేతనం రాకపోవడంతో బుధవారం బ్యాంకుకు, ఎంపీవో కార్యాలయానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. తండా నుంచి గంగు పేరును ప్రభుత్వానికి పంపించడంతో.. అతడికి వేతనం వస్తున్నదని ఎంపీవో కార్యాలయంలో తెలిపారు. దీంతో తనకు అన్యాయం జరిగిందని మనస్తాపం చెందిన లస్కర్ బుధవారం గ్రామ పంచాయతీ ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు, కుటుంబీకులు వెంటనే దవాఖానకు తరలించారు. తనకు న్యాయం చేయాలని లస్కర్ కోరుతున్నాడు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా.. జీపీ నుంచి ఇద్దరు కార్మికుల పేర్లను ప్రభుత్వానికి పంపించగా.. కేవలం గంగుకు మాత్రమే వేతనం జమచేసిందని చెప్పారు. మండలంలో పలువురిది ఇదే పరిస్థితి ఉన్నదన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం

ఇద్దరిపై కేసు నమోదు

ఆర్మూర్‌టౌన్, జనవరి 30: మెండోరా మండలం పోచంపాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీడెన్‌సన్ తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. పోచంపాడ్ ఎక్స్‌రోడ్ వద్ద సిబ్బందితో కలిసి రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా ఆదిలాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై రవాణా చేస్తున్న గంజాయితోపాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 1.300 కేజీల ఎండు గంజాయి, ఒక బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళితసంఘాల నాయకులు

మోర్తాడ్, జనవరి 30: ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడని బీజేపీ ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను మోర్తాడ్‌లో గురువారం దళితసంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... బండి సంజయ్‌ను పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని, పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళితసంక్షేమసంఘం మండల అధ్యక్షుడు మల్లూరి రాజారాం, జాంభవ, మామిడిగంగాధర్, ఉమేశ్, అంగుళీ మాలజీ, పులిశేఖర్, బండిసాగర్, బోడగణేశ్, మామిడిరాజేందర్, కుందన రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్-నిజామాబాద్ మార్గంలో

రాకపోకలు బంద్

- ఫిబ్రవరి 2 నుంచి 8 వరకు అడవిమామిడిపల్లి ఆర్వోబీ వద్ద మరమ్మతులు
- భారీ వాహనాలు డిచ్‌పల్లి మీదుగా వెళ్లాలని అధికారుల సూచన

మాక్లూర్, జనవరి 30: మండలంలోని అడవిమామిడిపల్లి గ్రామంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద మరమ్మతుల నేపథ్యంలో ఫిబ్రవరి 2 నుంచి 8వ తేదీ వరకు భారీ వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు సెక్షన్ ఇంజినీర్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్మూర్ నుంచి నిజామాబాద్, నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్లే భారీ వాహనాలతోపాటు ఫోర్ వీలర్ వాహనాలు 44వ నంబర్ జాతీయ రహదారి డిచ్‌పల్లి మీదుగా రాకపోకలు కొనసాగించాలని సూచించారు. ద్విచక్రవాహనాలు యథావిధిగా అడవి మామిడిపల్లి గ్రామం నుంచి ఆర్మూర్‌కు రాకపోకలు కొనసాగించవచ్చని పేర్కొన్నారు. వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు.

తనయుడిని చంపిన తల్లికి పదేండ్ల కఠిన కారాగార శిక్ష

వినాయక్‌నగర్, జనవరి 30: తనయుడిని చంపిన తల్లికి పదేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు వేయి రూపాయల జరిమానా విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి టి.శ్రీనివాస్ గురువారం తీర్పు వెలువరించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన గడ్డం భరత్‌కు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లికి చెందిన లావణ్యతో వివాహం అయ్యింది. వారికి ఆరేండ్ల కుమారుడు ఉన్నాడు. కల్లుకు బానిసగా మారిన లావణ్య.. తనకు కల్లు తీసుకురావాలని భర్తను వేధించేది. మార్చి 28,2023న ఉదయం లావణ్య కుమారుడిని వెంట బెట్టుకొని నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లింది. ఆరోజు రాత్రి రైల్వేస్టేషన్‌లోనేపడుకున్నది. మార్చి 29వ తేదీన మాక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద ఉన్న నిజాంసాగర్ కెనాల్ వద్దకు వెళ్లింది. కుమారుడు రోహిత్‌ను నీళ్లలో ముంచి, గొంతు నులిమి చంపేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కోర్టు విచారణలో ఆమెపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీనివాస్ పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు వేయి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా నెల రోజుల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. కేసులో పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ వాదనలు వినిపించారు.

జాన్కంపేట్ శివారులో చిరుత సంచారం

సీటీసీ క్యాంపులో కుక్కను నోటకరుచుకొని వెళ్లిన చిరుత

ఎడపల్లి, జనవరి 30: మండలంలోని జాన్కంపేట్ శివారు ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపింది. సీటీసీ క్యాంపు ఆవరణలో బుధవారం సాయంత్రం చిరుతపులి ఓ కుక్కను నోట కరుచుకొని వెళ్తుండగా క్యాంపు సిబ్బంది, హోం గార్డు గమనించి వెంటనే సీటీసీ ఎస్సై శివరాం ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంజయ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సిబ్బందితో కలిసి గురువారం సీటీసీ క్యాంపునకు చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం క్యాంపు సిబ్బందికి క్రూర మృగాల నుంచి ఆత్మరక్షణకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. త్వరలోనే బోను ఏర్పాటు చేసి చిరుతను పట్టుకుంటామని తెలిపారు.

కుష్టువ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపొద్దు

బాల్కొండ, జనవరి 30 : కుష్టువ్యాధి సోకిన వారిపై వివక్ష చూపరాదని, వ్యాధికి సంబంధించిన ఎలాంటి సందేశాలను సమాజంలో వ్యాప్తి చేయనివ్వద్దని అధికారులు సూచించారు.బాల్కొండ గ్రామపంచాయతీలో గురువారం కుష్టు వ్యాధిపై ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుజాత, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, ఆశ వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

భీమ్‌గల్ , జనవరి 30 : మండల పరిధిలోని కుప్కల్ గ్రామశివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపార